తెలంగాణ శుభారంభం

కామారెడ్డిలో జాతీయ స్కూల్ గేమ్స్ కబడ్డీ పోటీలు

కామారెడ్డి, జనవరి 7: జాతీయ స్కూల్ గేమ్స్ అండర్-17 కబడ్డీ పోటీల్లో తెలంగాణ శుభారంభం చేసింది. కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఆదివారం రాత్రి అట్టహాసంగ ఆప్రారంభమైన పోటీల తొలి పోరులో తెలంగాణ 8 పాయింట్ల తేడాతో పశ్చిమబెంగాల్‌పై విజయం సాధించింది. ఇతర మ్యాచ్‌ల్లో జార్ఖండ్‌పై కేరళ, జమ్ముకశ్మీర్‌పై హిమాచల్ ప్రదేశ్, కేంద్రీయ విద్యాలయపై తమిళనాడు గెలుపొందాయి. అంతకుముందు కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకట రమణారెడ్డి, కలెక్టర్ జితేశ్ పాటిల్ పోటీలను ప్రారంభించారు. ఈ టోర్నీలో 29 రాష్ట్రాలకు చెందిన సుమారు 450 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించాలని.. చిన్నప్పటి నుంచే క్రీడాస్ఫూర్తిని అలవరుచుకోవాలని అన్నారు. కామారెడ్డిలో తొలిసారి జాతీయ స్థాయి పోటీలు జరగడం ఆనందంగా ఉందన్నారు.

సిరీస్ సమం

రెండో టీ20లో భారత్ ఓటమి

ముంబై: గత మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆస్ట్రేలియాను చిత్తుచేసిన భారత్.. రెండో మ్యాచ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయింది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా తొలి పోరులో విజయం సాధించిన టీమ్‌ఇండియా.. ఆదివారం జరిగిన రెండో టీ20లో ఆస్ట్రేలియా చేతిలో 6 వికెట్ల తేడాతో పరాజయం పాలైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 130 పరుగులు చేసింది. ఆల్‌రౌండర్ దీప్తి శర్మ (30) టాప్ స్కోరర్ కాగా.. రిచ ఘోష్ (23), స్మృతి మంధన (23) రాణించారు. ఆసీస్ బౌలర్లలో జార్జియా, అనాబెల్, కిమ్ గార్త్ తలా రెండు వికెట్లు పడగొట్టారు. అనంతరం లక్ష్యఛేదనలో ఆసీస్ 19 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 133 పరుగులు చేసింది. ఎలీసా పెర్రీ (34 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ధాటిగా ఆడింది. మన బౌలర్లలో దీప్తి శర్మ రెండు వికెట్లు పడగొట్టింది. ఇరు జట్ల మధ్య నిర్ణయాత్మక మూడో పోరు మంగళవారం జరగనుంది.

పవర్ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడిగా రమేశ్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: తెలంగాణ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ కొత్త అధ్యక్షుడిగా కొత్తపల్లి రమేశ్‌గౌడ్ ఎన్నికయ్యాడు. ఆదివారం ఎల్బీ స్టేడియంలోని ఒలింపిక్ భవన్‌లో జరిగిన ఎన్నికలో రమేశ్‌గౌడ్ అధ్యక్షుడిగా, జోసెఫ్ జేమ్స్‌ను కార్యదర్శిగా ఎన్నుకున్నారు. పవర్ లిఫ్టింగ్ ఇండియా నుంచి అబ్సర్వర్ కోటేశ్వరరావు, సాట్స్ అబ్సర్వర్ రవికుమార్ సమక్షంలో ఈ ప్రక్రియ సాగింది. ఇందులో తెలంగాణలో అన్ని జిల్లాల నుంచి పవర్ లిఫ్టింగ్ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రమేశ్‌గౌడ్ మాట్లాడుతూ.. త్వరలోనే సర్వసభ్య సమావేశం నిర్వహించిన పవర్ లిఫ్టర్లకు కావాల్సిన సౌకర్యాలను మెరుగుపరచడంపై దృష్టి పెడతామని అన్నారు.

సహజ ప్రతిభ

మూడు ఐటీఎఫ్ టైటిల్స్ కైవసం

సానియా వారసురాలిగా గుర్తింపు

యువ టెన్నిస్ ప్లేయర్‌తో నమస్తే తెలంగాణ ఇంటర్వ్యూ



తండ్రితో కలిసి సరదాగా గ్రౌండ్ బాట పట్టిన ఆ చిన్నారి.. టెన్నిస్ బంతి చూసి ఆకర్షితురాలైంది. పదేండ్ల ప్రాయంలో సంబురంగా రాకెట్ పట్టిన ఆ బుడత.. ఇప్పుడు మూడు ఐటీఎఫ్ టైటిల్స్ ఖాతాలో వేసుకొని దేశంలో మూడో ర్యాంక్‌కు చేరింది!

పట్టుదల ఉంటే సాధ్యం కానిదంటూ లేదని నిరూపిస్తూ.. ఖర్చుతో కూడిన టెన్నిస్ క్రీడలో ప్రతిభ చాటుతున్నది. జూనియర్ స్థాయిలో పెద్దగా అనుభవం లేకపోయినా.. సీనియర్ సర్క్యూట్‌లో అడుగుపెట్టిన అనతి కాలంలోనే అద్భుతాలు చేస్తున్న ఆ అమ్మాయి.. భవిష్యత్తు సానియా మీర్జాగా మన్ననలు అందుకుంటోంది!!

సామాజిక మాధ్యమాలు, సినిమాలకు దూరంగా.. గంటల తరబడి కోర్టులో చెమటోడుస్తూ.. గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టోర్నీలు ఆడటమే లక్ష్యంగా సాగుతున్న తెలంగాణ యువ టెన్నిస్ ప్లేయర్ యామలపల్లి సహజతో నమస్తే తెలంగాణ ప్రత్యేక ఇంటర్వ్యూ..

ఇష్టమైన ప్లేయర్?

అమెరికా టెన్నిస్ దిగ్గజం సెరెనా విలియమ్స్ ఆట చూస్తూ పెరిగా. గ్రౌండ్‌లో సెరెనా దూకుడు బాగా నచ్చుతుంది. స్వతహాగా నేను కూడా అదే దూకుడుతో ఆడతా. ఇగా స్పియాటెక్ ఆట కూడా ఇష్టమే. ఇక భారత్ విషయానికి వస్తే.. హైదరాబాద్ స్టార్ సానియా మీర్జా అందరికీ ఆదర్శమే. లియాండర్ పేస్, రోహన్ బోపన్న కూడా యువ ఆటగాళ్లను బాగా ప్రోత్సహిస్తారు.

భవిష్యత్తు లక్ష్యాలేంటి?

గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయింగ్ టోర్నీకి అర్హత సాధించడం ఇప్పుడు నా ముందున్న లక్ష్యం. దాని కోసం తీవ్రంగా శ్రమిస్తున్నా. రోజుకు 8 గంటలకు పైగా కఠోర సాధన చేస్తున్నా.

కుటుంబ నేపథ్యం ఏంటి?

మా సొంతూరు ఖమ్మం. నా చిన్నప్పుడే అమ్మానాన్న సుప్రియ, భవాని కుమార్ హైదరాబాద్‌కు వచ్చేశారు. గతంలో నాన్న సాఫ్ట్‌వేర్ జాబ్ చేసేవాళ్లు.. కానీ నా ట్రైనింగ్, టోర్నీల కారణంగా అది సాధ్యపడక పోవడంతో ప్రస్తుతం ఇంజనీరింగ్ కళాశాల్లో గెస్ట్ లెక్చరర్‌గా కొనసాగుతున్నారు.

టెన్నిస్‌పై మక్కువ ఎలా కలిగింది?

చిన్నప్పుడు సాధారణ ఫిట్‌నెస్ కోసం నాన్న సరూర్‌నగర్ స్టేడియానికి తీసుకెళ్లేవారు. పదేండ్ల వయసులో టెన్నిస్ అంటే మక్కువ ఏర్పడింది. ఆరంభంలో అక్కడే ప్రాక్టీస్ చేసేదాన్ని.. ఆ తర్వాత ఎల్బీస్టేడియంలో శిక్షణ తీసుకున్నా.

ప్రొఫెషనల్ కెరీర్ ఎప్పటి నుంచి?

పదో తరగతికి వచ్చేసరికి నాకు టెన్నిస్‌పై ఇష్టం మరింత పెరిగింది. దీంతో ఇక భవిష్యత్తులో ఆటతోనే కొనసాగాలని నిర్ణయించుకున్నా. శిక్షణ కోసం రోజుకు దాదాపు 30 కిలోమీటర్లు ప్రయాణించేదాన్ని. ప్రతీ క్షణం నాన్న నా వెంట ఉండేవారు. ప్రహ్లాద్ కుమార్ జైన్ సార్ సూచనలతో ప్రొఫెషనల్ టెన్నిస్ కెరీర్ ప్రారంభించా. చెన్నై వేదికగా 2017లో జరిగిన ఐటీఎఫ్ జూనియర్ టోర్నీలో సత్తాచాటడంతో నాపై నాకు నమ్మకం ఏర్పడింది. దాని వల్లే యూఎస్ కాలేజీలో స్కాలర్‌షిప్ లభించింది.

చదువు ఎలా సాగుతోంది?

కెరీర్ కొనసాగిస్తూనే.. నాన్న ప్రైవేట్ క్లాస్‌ల సహాయంతో ఇంటర్ పూర్తి చేశా. అమెరికాలో ఫుడ్ సైన్స్‌లో డిగ్రీ పట్టా పొందా. సినిమాలు, సామాజిక మాధ్యమాల జోలికి వెళ్లను. నిజం చెప్పాలంటే అసలు అంత సమయమే లభించదు.

ఇప్పటి వరకు సాధించిన విజయాలు?

మహిళల ప్రొఫెషనల్ టెన్నిస్‌లో మూడు ఐటీఎఫ్ టైటిల్స్ గెలిచా.. ఒక దాంట్లో రన్నరప్‌గా నిలిచా. ఇటీవల జరిగిన సోలాపూర్ ఐటీఎఫ్ 25కే టోర్నీలో విజేతగా నిలిచా.

ప్రస్తుత ర్యాంకింగ్ ఎంత?

గత నెలలో విడుదల చేసిన డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో అత్యుత్తమంగా 340వ ర్యాంక్‌కు చేరుకున్నా.. ఈ ఏడాది చివరి వరకు దాన్ని 200కు తగ్గించాలని నిర్ణయించుకున్నా. అప్పుడే గ్రాండ్‌స్లామ్ క్వాలిఫయర్స్ ఆడే అవకాశం దక్కుతుంది. దేశంలో చూసుకుంటే.. అంకిత రైనా, కర్మన్ కౌర్ థండీ తర్వాత మూడో ర్యాంక్‌లో ఉన్నా.

బలాబలాలు?

మొదటి నుంచి ఫోర్ హ్యాండ్ షాట్ల పైనే ఎక్కువగా దృష్టి పెట్టా. మన బలాబలాలను అంచనా వేసుకొని ప్రత్యర్థులపై పైచేయి సాధించడం ముఖ్యం. ఏకకాలంలో రెండు చేతుల నుంచి సమాన వేగంగా షాట్లు ఆడగలను.

> టెన్నిస్‌లో రాణించాలంటే ప్రతిభ ఒక్కటే సరిపోదు. కఠోర శ్రమతో పాటు ఆర్థిక వనరుల అవసరం ఎక్కువగా ఉంటుంది. అంతర్జాతీయ టోర్నీలు ఆడడం ఖర్చుతో కూడుకున్న పని. ఈ ఇబ్బంది వల్లే ఆరంభంలో ఎక్కువ టోర్నీలు ఆడలేకపోయా. అమెరికాలో చదువుతున్న సమయంలో విరివిగా టోర్నీలు ఆడే అవకాశం దక్కడంతో ర్యాంకింగ్ మెరుగుపడింది. స్పాన్సర్లు లేకపోవడంతో.. జైన్ సార్, నాన్న స్నేహితుల సాయంతో టోర్నీల్లో పాల్గొంటున్నా. ఆర్థిక అండ లభిస్తే.. మెరుగైన ఫలితాలు సాధిస్తాననే నమ్మకముంది.

రోహిత్, కోహ్లీ బ్యాక్

అఫ్గాన్‌తో టీ20 సిరీస్‌కు జట్టు ప్రకటన

కేప్‌టౌన్: 2022 టీ20 ప్రపంచకప్ నుంచి పొట్టి ఫార్మాట్‌కు దూరంగా ఉంటున్న సీనియర్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ తిరిగి జాతీయ జట్టులోకి వచ్చారు. ఈ ఏడాది అమెరికా, వెస్టిండీస్ వేదికగా టీ20 వరల్డ్‌కప్ జరగనుండగా.. సీనియర్ల అవసరం జట్టుకు ఉందని భావించిన సెలెక్షన్ కమిటీ.. వీరిద్దరినీ అఫ్గాన్‌తో సిరీస్‌కు ఎంపిక చేసింది. పొట్టి ప్రపంచకప్‌నకు ముందు టీమ్‌ఇండియా ఆడనున్న చివరి అంతర్జాతీయ సిరీస్ ఇదే కాగా.. ఈ నెల 11 నుంచి భారత్, అఫ్గాన్ మధ్య మూడు మ్యాచ్‌ల టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. తొలి మ్యాచ్‌కు మొహాలీ ఆతిథ్యమివ్వనుంది. హార్దిక్ పాండ్యా, సూర్యకుమార్ గాయంతో జట్టుకు దూరం కాగా.. తెలంగాణ ప్లేయర్ తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే, వాషింగ్టన్ సుందర్ టీమ్‌లో చోటు దక్కించుకున్నారు. కేఎల్ రాహుల్, బుమ్రా, సిరాజ్, జడేజాకు ఈ సిరీస్ నుంచి విశ్రాంతినిచ్చారు.

జట్టు: రోహిత్ (కెప్టెన్), గిల్, యశస్వి, కోహ్లీ, తిలక్, రింకూ, జితేశ్, శాంసన్, శివమ్, సుందర్, అక్షర్, రవి, కుల్దీప్, అర్ష్‌దీప్, అవేశ్, ముఖేశ్.

సుహాస్ తీన్మార్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: జాతీయ స్కూల్ గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ యువ స్విమ్మర్ సుహాస్ ప్రీతమ్ మూడు పతకాలతో సత్తాచాటాడు. ఢిల్లీలోని శ్యామ్ ప్రసాద్ ముఖర్జీ స్విమ్మింగ్ పూల్ కాంప్లెక్స్‌లో జరిగిన ఈ పోటీల్లో సుహాస్ ఒక స్వర్ణం, 2 రజతాలు కైవసం చేసుకున్నాడు. ఆదివారం జరిగిన అండర్-17 బాలుర 50 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్‌లో సుహాస్ 27.32 సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచాడు. తెలంగాణకు చెందిన వర్షిత్ 200 మీటర్ల మెడ్లేలో రజతం గెలుచుకున్నాడు.

> అల్టిమేట్ ఖో-ఖో లీగ్ పాయింట్ల పట్టికలో డిఫెండింగ్ చాంపియన్ ఒడిషా జగ్గర్‌నాట్స్ అగ్రస్థానానికి చేరింది. ఆదివారం కటక్‌లో జరిగిన పోరులో ఒడిషా 35-27తో తెలుగు యోధాస్‌పై విజయం సాధించింది.

ఈ కొత్త రూల్స్ తెలుసా..

పోస్టాఫీస్ చిన్నమొత్తాల పొదుపు పథకాల్లో మార్పులివే

గత ఏడాది కేంద్ర ప్రభుత్వం ఆయా పోస్టాఫీస్ చిన్నమొత్తాల పొదుపు పథకాల్లో పలు కీలక మార్పులు చేసింది. ఓ కొత్త పథకాన్ని పరిచయం చేస్తూనే.. పెట్టుబడికున్న పరిమితుల్ని సర్దుబాటు చేయడం, వడ్డీరేట్ల గణనను మార్చడం వంటివి చేపట్టింది. పీపీఎఫ్, పీవోటీడీ, పీవోఎంఐఎస్, ఎస్‌సీఎస్ఎస్ స్కీముల్లోనూ సవరణల్ని తీసుకొచ్చింది. వాటి విషయానికొస్తే..

మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్

గత ఏడాది బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం దీన్ని పరిచయం చేసింది. మహిళలు, బాలికలనుద్దేశించి దీన్ని తీసుకొచ్చారు. నిరుడు ఏప్రిల్ నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు ఈ పథకం అందుబాటులో ఉంటుంది. కనిష్ఠంగా రూ.1,000, గరిష్ఠంగా రూ.2 లక్షల వరకు డిపాజిట్ చేసుకోవచ్చు. కాలపరిమితి రెండేండ్లు. వార్షిక వడ్డీరేటు 7.5 శాతం లభిస్తుంది. డిపాజిట్‌దారులు తమ అవసరాలనుబట్టి పాక్షిక ఉపసంహరణలు చేసుకోవచ్చు. డిపాజిట్ చేసిన ఏడాది తర్వాత అందులో 40 శాతం వరకు తిరిగి తీసుకోవచ్చు. అలాగే 6 నెలల తర్వాత 5.5 శాతం వడ్డీకి డిపాజిట్‌ను విత్‌డ్రా చేసుకోవచ్చు. డిపాజిట్‌దారు చనిపోయినా, ప్రాణాంతక వ్యాధుల బారినపడ్డా డిపాజిట్ ఉపసంహరణకు అవకాశం ఉంటుంది. అయితే ఒక కుటుంబంలో ఒకరి పేరిట ఈ స్కీముకు సంబంధించిన ఖాతాను పోస్టాఫీస్‌లో తెరిస్తే.. మళ్లీ 3 నెలల వరకు మరొకరి పేరుమీద ఇంకో ఖాతాను తెరవడానికి వీల్లేదు. ఇక ఈ పథకంలో వచ్చే వడ్డీకి టీడీఎస్ వర్తించదు. కానీ ఆర్థిక సంవత్సరంలో రూ.40,000లకు మించి (సీనియర్ సిటిజన్లకు రూ.50,000) వడ్డీని పొందితే టీడీఎస్ ఉంటుంది.

పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్ స్కీం

2023 బడ్జెట్‌లో సింగిల్ అకౌంట్ యూజర్ల కోసం ఈ పథకం డిపాజిట్ పరిమితిని రూ.4.5 లక్షల నుంచి రూ.9 లక్షలకు పెంచారు. జాయింట్ ఖాతాదారుల కోసం రూ.9 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచారు.

సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం

ఎస్‌సీఎస్ఎస్‌లో గరిష్ఠ పెట్టుబడి పరిమితిని రూ.15 లక్షల నుంచి రూ.30 లక్షలకు పెంచారు. తద్వారా మరింత డిపాజిట్లపై అధిక వడ్డీరేటును పొందే అవకాశాన్ని వృద్ధులకు కల్పించారు.

పీపీఎఫ్ వడ్డీ గణనలో సవరణలు

పీపీఎఫ్ స్కీం 2019 కింద రెగ్యులర్‌గా జమయ్యే వడ్డీ కంటే 1 శాతం తక్కువగా ముందస్తు ఉపసంహరణ పథకాలపై వడ్డీ ఉంటుంది. ప్రస్తుతమున్న ఐదేండ్ల బ్లాక్ పీరియడ్ నుంచి దీన్ని లెక్కిస్తారు.

పోస్టాఫీస్ టైమ్ డిపాజిట్ పెనాల్టీ

పోస్టాఫీస్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను నిర్ణీత కాలవ్యవధి కంటే ముందే వెనక్కి తీసుకుంటే 2 శాతం జరిమానా పడుతుంది. సదరు ఎఫ్‌డీలకు నిర్ణయించిన వడ్డీరేటులో 2 శాతం తగ్గించి చెల్లిస్తారు.

ఎస్‌సీఎస్ఎస్‌లో మార్పులు

- 55-60 ఏండ్లవారికి తమ రిటైర్మెంట్ ప్రయోజనాల పెట్టుబడికి 3 నెలల సమయం
- ప్రభుత్వ ఉద్యోగుల జీవిత భాగస్వాములు ఈ పథకంలో పెట్టుబడికి అర్హులు
- ఏడాదిలోపే ఖాతాను మూసేస్తే డిపాజిట్‌లో 1 శాతం మినహాయిస్తారు
- స్కీం పొడిగింపుపై పరిమితులు లేవు
- పొడిగించిన ఎస్‌సీఎస్ఎస్ ఖాతాల్లో పెంచిన మెచ్యూరిటీపై వడ్డీ.

పోస్టాఫీస్ చిన్నమొత్తాల పొదుపు పథకాలు

1. పోస్టాఫీస్ సేవింగ్స్ బ్యాంక్ అకౌంట్ (ఎస్‌బీ)
2. నేషనల్ సేవింగ్స్ రికరింగ్ డిపాజిట్ అకౌంట్ (ఆర్‌డీ)
3. నేషనల్ సేవింగ్స్ టైమ్ డిపాజిట్ అకౌంట్ (టీడీ)
4. నేషనల్ సేవింగ్స్ మంత్లీ ఇన్‌కమ్ అకౌంట్ (ఎంఐఎస్)
5. సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీం అకౌంట్ (ఎస్‌సీఎస్ఎస్)
6. పబ్లిక్ ప్రొవిడెంట్ ఫండ్ అకౌంట్ (పీపీఎఫ్)
7. సుకన్య సమృద్ధి అకౌంట్ (ఎస్ఎస్వై)
8. నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్స్ (8వది) (ఎన్ఎస్‌సీ)
9. కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ)
10. మహిళా సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ)



రాబడి

పరిమిత శ్రేణిలో మార్కెట్

డిసెంబర్ చివరివారంలో బలమైన ర్యాలీ జరిపిన ఎన్ఎస్ఈ నిఫ్టీ జనవరి 1న 21,834 పాయింట్ల కొత్త రికార్డుస్థాయిని తాకింది. అటుతర్వాత నాలుగు రోజులూ కేవలం 250 పాయింట్ల శ్రేణిలో హెచ్చుతగ్గులకు లోనయ్యి, చివరకు 21,711 పాయింట్ల వద్ద ముగిసింది. మరోవైపు అమెరికా ఆర్థికవ్యవస్థ బలంగా ఉందనడానికి సంకేతంగా అక్కడ పటిష్ఠమైన జాబ్స్ డాటా వెలువడటంతో ఫెడ్ వడ్డీ రేట్లు వేగంగా తగ్గవన్న అంచనాలు ఏర్పడుతున్నాయి. దీంతో ప్రపంచ ప్రధాన స్టాక్ సూచీలు చిన్న రేంజ్‌లో ట్రేడవుతున్నాయి. ఈ నేపథ్యంలో నిఫ్టీ గతవారపు ట్రేడింగ్ రేంజ్‌ను ఎటువైపు బ్రేక్ చేస్తే అటు కదల వచ్చని సామ్కో సెక్యూరిటీస్ సీఈవో జిమిత్ మోది చెప్పారు. ప్రస్తుతం మార్కెట్ 21,500-21,800 శ్రేణిలో కన్సాలిడేట్ అవుతున్నదని, బ్రేక్‌అవుట్ జరిగేంతవరకూ ఇదే శ్రేణికి పరిమితం అవుతుందని ఛాయస్ బ్రోకింగ్ రీసెర్చ్ అనలిస్ట్ సుమీత్ బగాడియా అన్నారు.

మార్కెట్ పల్స్

మద్దతు 21,500-21,600

ఎన్ఎస్ఈ డెరివేటివ్ డాటా ప్రకారం 21,500, 21,600 స్ట్రయిక్స్ వద్ద పుట్ రైటింగ్ జరిగినందున, ఈ స్థాయిలు నిఫ్టీకి మంచి మద్దతు అందించవచ్చని యాక్సిస్ సెక్యూరిటీస్ టెక్నికల్ హెడ్ రాజేశ్ పాల్వియా అంచనా వేశారు. నిఫ్టీ 21,600, 21,550 పాయింట్ల వద్దకు తగ్గితే 21,500 స్టాప్‌లాస్‌తో కొనవచ్చని ఇన్వెస్టర్లకు సూచించారు. గరిష్ఠస్థాయిలో 21,750 పాయింట్ల వద్ద అవరోధం కలగవచ్చని, ఈ స్థాయిని దాటితే షార్ట్ కవరింగ్ ప్రభావంతో 21,900 వరకూ పెరుగుతుందని విశ్లేషించారు. 22,000 స్థాయిని సైతం అందుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ వారం నిఫ్టీ 21,500 మద్దతును కోల్పోతే తదుపరి 21,350 పాయింట్ల వద్ద మద్దతు లభిస్తున్నదని, 21,750 నిరోధస్థాయిని దాటితే 21,950 స్థాయి తదుపరి అవరోధాన్ని కల్గించవచ్చని జిమిత్ మోది అంచనా వేశారు.

డిపాజిట్లకు వేళాయె!

మీ పెట్టుబడులపై అధిక రాబడిని కోరుకుంటున్నారా? అయితే ప్రధాన బ్యాంకుల్లో డిపాజిట్ చేయండి. గతంలో కంటే అధిక వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నాయి బ్యాంకులు. దీంతో పెట్టుబడిదారులకు ఫిక్స్‌డ్ డిపాజిట్లు ఆకర్షణీయంగా మారుతున్నాయి. ఇటీవల కాలంలో ఎస్బీఐతోపాటు బీవోబీ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులతోపాటు ఇతర ఆర్థిక సంస్థలు వడ్డీరేట్లను భారీగా పెంచుతున్నాయి. డిపాజిట్లపై వడ్డీరేట్లను ఒక్క శాతానికి పైగా సవరించాయి. గతంలో కేవలం 3-4 శాతం స్థాయిలో ఉన్న రేట్లు ఇటీవల కాలంలో 8-10 శాతం మధ్యలోకి చేరాయి. ఏయే బ్యాంకులు ఎంతమేర వడ్డీరేట్లను ఆఫర్ చేస్తున్నాయో ఒక్కసారి చూద్దాం...

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

> దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్బీఐ) డిపాజిట్‌దారులను ఆకట్టుకోవడానికి వడ్డీరేట్లను అర శాతం మేర పెంచింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై వడ్డీరేటును 3.5 శాతం నుంచి 7 శాతం మధ్యలో ఆఫర్ చేస్తున్నది. సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అరశాతం చెల్లిస్తున్నది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్

పంజాబ్ నేషనల్ బ్యాంక్ రూ.2 కోట్ల లోపు ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీరేటును అర శాతం వరకు సవరించింది. ఈ పెంపు 180 రోజుల నుంచి 270 రోజులలోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లకు మాత్రమే వర్తించనున్నదని పేర్కొంది. దీంతో సాదారణ ప్రజలకు 6 శాతం వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు మరో అర శాతం అదనంగా చెల్లిస్తున్నది. అలాగే 271 రోజుల నుంచి ఏడాది లోపు డిపాజిట్లపై వడ్డీని 45 బేసిస్ పాయింట్లు అధికం చేయడంతో రేటు 7.25 శాతానికి చేరుకున్నది. ప్రస్తుతం బ్యాంక్ 3.5 శాతం నుంచి 7.25 శాతం లోపు వడ్డీని ఆఫర్ చేస్తున్నది

బ్యాంక్ ఆఫ్ బరోడా

> బ్యాంక్ ఆఫ్ బరోడా అయితే ఒక అడుగు ముందుకేసి డిపాజిట్లపై అత్యధికంగా 125 బేసిస్ పాయింట్లు సవరించింది. రూ.2 కోట్ల లోపు డిపాజిట్లపై ఈ నూతన వడ్డీరేట్లు వర్తించనున్నాయని పేర్కొంది. బ్యాంక్ తీసుకున్న తాజా నిర్ణయంతో ఎఫ్‌డీలపై వడ్డీరేటు 4.25 శాతం నుంచి 7.25 శాతం మధ్యలో ఆఫర్ చేస్తున్నది. సీనియర్ సిటిజన్లకు మాత్రం 4.75 శాతం నుంచి 7.75 శాతం మధ్యలో చెల్లిస్తున్నది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్

ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ కూడా డిపాజిట్లపై వడ్డీరేట్లను పెంచేసింది. ఏడాది నుంచి 15 నెలల లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీరేటును 6.6 శాతానికి సవరించింది. అలాగే 15 నెలల నుంచి 18 నెలల్లోపు డిపాజిట్లపై వడ్డీని సైతం 7.10 శాతానికి పెంచిన బ్యాంక్..18-24 నెలల్లోపు డిపాజిట్లపై 7 శాతానికి పెంచింది.

ఐసీఐసీఐ బ్యాంక్ సైతం

ఏడాది నుంచి 389 రోజుల కాలపరిమితి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీని 7.25 శాతానికి సవరించింది ఐసీఐసీఐ బ్యాంక్. అలాగే 61 రోజుల నుంచి 90 రోజుల్లోపు కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై రేటును 4.5 శాతం నుంచి 6 శాతానికి పెంచింది. 91 నుంచి 184 రోజుల కాలపరిమితి కలిగిన డిపాజిట్లపై వడ్డీని 6.5 శాతానికి సవరించిన బ్యాంక్..185-270 రోజుల డిపాజిట్లపై 6.75 శాతానికి, 390 నుంచి 15 నెలల లోపు డిపాజిట్లపై 7.25 శాతానికి పెంచింది. ఐదేండ్ల నుంచి 10 ఏండ్ల లోపు డిపాజిట్లపై రేటును 6.9 శాతం నుంచి 7 శాతానికి పెంచింది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.